సరిహద్దులను గుర్తించండి

- ఊర చెరువు శిఖం భూమి కబ్జాకు గురవుతోంది
- అధికారులకు వినతిపత్రాన్ని అందజేసిన జప్తిజాన్కంపల్లి గ్రామస్తులు


నాగిరెడ్డిపేట తహసీల్దార్ సయీద్ అహ్మద్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న గ్రామస్తులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): తమ గ్రామ శివారులోని ఊరచెరువుకు సర్వే నిర్వహించి సరిహద్దులు గుర్తించాలని కోరుతూ నాగిరెడ్డిపేట మండలంలోని జప్తిజాన్కంపల్లి గ్రామస్తులు సోమవారం స్థానిక తహసీల్దార్ సయీద్ అహ్మద్ మన్సూర్, ఇరిగేషన్ అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ గ్రామానికి సంబంధించిన ఊరచె రువు 107 ఎకరాల 30 గుంటల విస్తీర్ణంతో ఉన్నదన్నారు. కొంతకాలంగా చెరువుకు సంబంధించిన శిఖం భూమి ఆక్రమణకు గురవుతుందని వారు చెప్పారు. దీనివల్ల చెరువులో నీటి నిల్వ సామర్థ్యం తగ్గి చేపలు మృత్యువాత పడుతున్నాయని వారు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సర్వే నిర్వహించి గుర్తించాలని అధికారులను వారు కోరారు. గ్రామసర్పంచ్ దేశబోయిన సాయిలుతోపాటు గ్రామానికి చెందిన మత్స్య సహకార సంఘం ఉపాధ్యక్షుడు సంగయ్య, ప్రధాన కార్యదర్శి సాయిలు, ఇతర సభ్యులున్నారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయండి


ఆర్గొండలో మాట్లాడుతున్న రైతులు

రాజంపేట: ఆర్గొండలో మక్కల కొనుగోలు కేంద్రం చేయాలని కోరుతూ సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఆర్గొండ సొసైటీ పరిధిలో కొండాపూర్‌లో మక్కల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి ఆర్గొండలో ఎందుకు ఏర్పాటు చేయలేదని రైతులు సంబంధిత సొసైటీ చైర్మన్ కంది శివరాములును ఫోన్‌లో ప్రశ్నించగా..హమాలీలు, సూపర్‌వైజర్లను మీరే నియమించుకుంటే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తామని దురుసుగా సమాధానం ఇచ్చినట్లు తెలిపారు. అకాల వర్షాలకు మక్కలు తడిచి పంటనష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా సొసైటీ పరిధిలో ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హమాలీలు ముందుకు వస్తే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు సొసైటీ చైర్మన్ శివరాములు తెలిపారు.

సోయాబీన్ విత్తనాల పంపిణీ


సోయా విత్తనాలు అందిస్తున్న కంపెనీ ప్రతినిధులు

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలో రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం సోయాబీన్ విత్తనాలను రైతులకు మద్నూర్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ చైర్మన్ చాట్లవార్ గోపాల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోయాబీన్ కేడీఎస్ 726 సర్టిఫైడ్ విత్తనాలను రైతులకు అందిస్తామని ఆయన అన్నారు. 25 కిలోల విత్తనాల బ్యాగు ధర రూ.2,200 అని తెలిపారు.

అడ్లూర్ ఎల్లారెడ్డిలో జీలుగ విత్తనాలు..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్ ఎల్లారెడ్డి సింగిల్ విండో కార్యాలయంలో సోమవారం జీలుగ విత్తనాలు, జనుము విత్తనాలు పంపిణీ చేశారు. జీలుగ 30 కిలోల బస్తా ధర రూ.842, కాగా జనుము 40 కిలోల బస్తా రూ.1,228గా నిర్ణయించినట్లు తెలిపారు. రెండు ఎకరాల 20 గుంటలకు గాను ఒక బస్తా చొప్పున పంపిణీ చేసినట్లు ఏఈవో శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. విండో చైర్మన్ మర్రి సదాశివరెడ్డి, విండో సీఈవో కడెం భైరయ్య పాల్గొన్నారు.

మాచారెడ్డి: మండల 3కేంద్రంలోని సింగిల్ విండోలో సోమవారం ఏవో రమ్యశ్రీ, వైస్ ఎంపీపీ నరసింహరెడ్డి, సింగిల్ విండో వైస్ చైర్మన్ లక్ష్మాగౌడ్‌లు రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. రైతు బంధు సమితి మండల కన్వీనర్ బుక్య నర్సింలు, డైరెక్టర్లు బుచ్చిరెడ్డి, కిషన్ గౌడ్, సీఈవో చంద్రారెడ్డి ఉన్నారు.

తిప్పాపూర్‌లో..

భిక్కనూరు: తిప్పాపూర్ సింగిల్ విండో ఆధ్వర్యంలో రైతులకు జీలుగ విత్తనాలను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సింగిల్ విండో అధ్యక్షుడు ఏనుగు వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి రైతు జీలుగ విత్తనాలను తమ పొలంలో విత్తుకోవాలని సూచించారు. ఎంపీటీసీల మండల ఫోరం కన్వీనర్ ద్యావర సాయిరెడ్డి, రైతు సమన్వయ సమితి గ్రామ కో–ఆర్డినేటర్ వంగేటి దుర్గారెడ్డి పాల్గొన్నారు.

బాల సంస్కార శిబిరానికి అపూర్వ స్పందన



సదాశివనగర్(ఎల్లారెడ్డి): లింగంపల్లి శ్రీ కృష్ణ మందిరంలో ఆదివారం ప్రారంభించిన బాల సంస్కార్ శిబిరానికి అపూర్వ స్పందన లభించింది. ఈ సందర్భంగా పీఠాధిపతి మచాలే బాబా మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నతులుగా ఎదగాలని కోరుకుంటారన్నారు. వారికి దేశభక్తి, దైవ భక్తి పెంపొందించడంతో పాటు ఉన్నత జీవితానికి అవసరమైన పునాది వేయాలనే ఉద్దేశంతోనే ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శిబిరం జూన్ 4 వరకు కొనసాగుతుందన్నారు.

కెమికల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా నిరసన దీక్షలు



భిక్కనూరు: ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీ యాజమాన్యానికి వ్యతిరేకంగా కాచాపూర్‌లో వీడీసీ ఆధ్వర్యంలో చేస్తున్న నిరసన దీక్షలు 35వ రోజుకు చేరుకున్నాయి. సోమవారం దీక్షలో కూర్చున్న సింగం శ్రీనివాస్‌కు తోడుగా ఆయన నాలుగేళ్ల మనుమడు రిషిక్ దీక్షలో కూర్చున్నాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దీక్షలో కూర్చున్న గ్రామస్తులతో పాట్లా బాలుడు కూడా నినాదాలు చేశాడు.

వీవోఏల ముందస్తు అరెస్ట్



పెద్దకొడప్‌గల్(జుక్కల్): రాష్ట్ర ఐకేపీ వీవోఏల సంఘం పిలుపు మేరకు సోమవారం హైదారాబాద్‌లో ఇందిరా పార్కు వద్ద మహాధర్నాకు బయలుదేరబోతున్న స్థానిక వీవోఏలను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ అక్రమ అరెస్టులను ఖండిస్తున్నట్లు వీవోఏలు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు. వీవోఏలు ఉమాకాంత్, సంతోష్, తదితరులున్నారు.

వైన్స్ నిర్వాహకులపై చర్యలకు డిమాండ్


మాట్లాడుతున్న దుబాస్ రాములు

బాన్సువాడ: బెల్టు దుకాణాలకు మద్యం సరఫరా చేస్తున్న వైన్స్ షాపు నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ ఇన్‌చార్జి దుబాస్ రాములు డిమాండ్‌చేశారు. సోమవారం పట్టణంలో ఆయన మాట్లాడారు. వైన్స్‌షాపుల నుంచి బెల్టు దుకాణాలకు మద్యం సరఫరాను నిలిపివేయాలన్నారు. వైన్స్ షాపులకు అనుబంధంగా ఉన్న పర్మిట్‌రూములు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. నాయకులు గంగాధర్, రాజయ్య, దుర్గాప్రసాద్, సాయి ప్రసాద్ తదితరులున్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ


అడ్లూర్‌లో భూమి పూజ చేస్తున్న బీజేపీ నేత కాటిపల్లి వెంకట రమణారెడ్డి

కామారెడ్డి రూరల్: అడ్లూర్‌లో మడేలయ్య స్వామి ఆలయ నిర్మాణానికి సోమవారం కామారెడ్డి బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలనే ఉద్దేశంతో ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు.

కొలతల ప్రకారం ఉపాధి పనులు చేయాలి


సురాయిపల్లిలో పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

లింగంపేట(ఎల్లారెడ్డి): సిబ్బంది సూచించిన కొలతల ప్రకారం పనులు చేయాలని ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి, ఉపాధి కూలీలకు సూచించారు. సోమవారం సురాయిపల్లి, సురాయిపల్లి జగదాంబ తండాలో చేపడుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడారు. పనుల గురించి ఆరా తీశారు. కూలీలు సమయ పాలన పాటించి కొలతల ప్రకారం చేస్తేనే కూలీకి తగ్గ డబ్బులు వస్తాయన్నారు. చెరువులో పూడిక తీసిన మట్టిని పంట చేలకు తరలించాలన్నారు. అనంతరం కూలీల మస్టర్లను పరిశీలించారు.

ఆలయాల అభివృద్ధికి నిధులు


బీరప్ప కల్యాణంలో పాల్గొన్న స్పీకర్ పోచారం

బాన్సువాడ: ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందని అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఫిల్టర్ బెడ్ వద్ద నూతనంగా నిర్మించిన బీరప్ప ఆలయంలో బీరప్ప కల్యాణానికి స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని కుల సంఘాలకు సమన్యాయం చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గంగాధర్, నాయకులు అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, ఏజాస్, జుబేర్, కుర్మ సంఘం నాయకులు బీరప్ప, నర్సగొండ, సరిత ఉన్నారు.

మన ఊరు-మన బడి పనులు ప్రారంభం


భూమిపూజ చేస్తున్న మర్కల్ సర్పంచ్ సంగారెడ్డి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మర్కల్‌లో సోమవారం మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనులకు సర్పంచ్ సంగారెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పాఠశాల ఆవరణలో డైనింగ్ హాల్, నీటి సంపు ఏర్పాటు కోసం భూమి పూజ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈవో యోసెఫ్, జెడ్పీటీసీ కమిలి నర్సింలు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ రాజిరెడ్డి, ఎంపీటీసీ భైరవ రెడ్డి, రాంరెడ్డి, తదితరులున్నారు.

గూడెంలో బీటీ రోడ్డు పనులు..

కామారెడ్డి రూరల్: గూడెంలో బీటీ రోడ్డు పనులను సోమవారం ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు ప్రారంభించారు. గూడెం, తిమ్మక్‌పల్లి మీదుగా రూ.2 కోట్ల 10 లక్షల విలువ గల బీటీ రోడ్డును ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ శంకర్ గౌడ్, సర్పంచ్ దంతెపల్లి స్వామి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గూడెం బాలరాజు, ఉపసర్పంచ్ మోతె మహేందర్, గూడెం గ్రామ బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు గుడుగుల కృష్ణ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

షబ్బీర్ అలీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు



కామారెడ్డి టౌన్: కామారెడ్డి పట్టణం, మండలంలోని ఇస్రోజీవాడి గ్రామానికి చెందిన నాయకులు మాజీ మంత్రి షబ్బీర్ అలీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలను కప్పి షబ్బీర్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. కామారెడ్డి నియోజకవర్గం అభివృద్ధి కావాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యం అన్నారు. సుమారు 100 మందికిపైగా నాయకులు పార్టీలో చేరారు. డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, గుడగుల శ్రీనివాస్, గూడెం శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాధితుల వివరాల సేకరణ


ఇళ్లు ధ్వంసమైన వారి వివరాలు సేకరిస్తున్న గిర్దావర్ నరసింహారెడ్డి

గాంధారి(ఎల్లారెడ్డి): గాలి వాన బీభత్సానికి ఇళ్లు కూలిన బాధితుల వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని గిర్దావర్ నరసింహారెడ్డి అన్నారు. ఆదివారం కురిసిన గాలి వానకు మండల పరిధిలోని జువ్వాడి, బ్రాహ్మణ్‌పల్లి, గుర్జాల్ గ్రామాల్లో ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయి ధ్వంసమయ్యాయి. సోమవారం గిర్దావర్ ఆయా గ్రామాలను సందర్శించి బాధితుల వివరాలు సేకరించారు.

క్లుప్తంగా

దళారులకు అమ్మి మోసపోవద్దు



పెద్దకొడప్‌గల్(జుక్కల్): జొన్న పంటను దళారులకు అమ్మి మోసపోవద్దని సొసైటీ చైర్మన్ హన్మంత్ రెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సంఘంలో చైర్మన్ హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జొన్న పంటకు ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.2,970 మద్దతు ధర కల్పిస్తుందని అన్నారు. ఎకరానికి 8 క్వింటాళ్లే తీసుకుంటామని అన్నారు. సొసైటీ ఉపాధ్యక్షుడు సంగా రెడ్డి, సర్పంచ్ తిర్మల్ రెడ్డి, ఉప సర్పంచ్ విఠల్ పాల్గొన్నారు.

రాంపూర్‌లో..

పిట్లం(జుక్కల్): రాంపూర్‌లో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని సోమవారం సహకార సంఘం చైర్మన్ శప్దంరెడ్డి ప్రారంభించారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వాసరి రమేష్, కార్యదర్శి సంతోష్ రెడ్డి, తదితరులున్నారు.

ఎంపీ పరామర్శ

మద్నూర్(జుక్కల్): రెండు రోజుల క్రితం సోనాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడు విజయ్ పాటిల్ దారుణహత్యకు గురి కావడంతో సోమవారం జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ మృతుడి కుటుంబ సభ్యులను వారి ఇంటికెళ్లి పరామర్శించారు. ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. విజయ్ పాటిల్ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ మంచి పేరు తెచ్చుకున్నారని ఎంపీ పేర్కొన్నారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.

ఉపాధి పనుల పరిశీలన

నిజాంసాగర్(జుక్కల్): ముగ్దుంపూర్ గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పనులను సోమవారం గ్రామ సర్పంచ్ బీమస్‌పల్లి లక్ష్మీనారాయణ పరిశీలించారు. మట్టి పూడికతీత పనులు చేపడుతూ కట్ట బలోపేతం చేయాలని కూలీలకు సూచించారు. ఉదయం పూటనే పనులకు వచ్చి ఎండ సమయానికి ఇంటికి వెళ్లాలన్నారు.

కబడ్డీ కిట్ల పంపిణీ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): క్రిష్ణాజివాడిలో సోమవారం క్రీడాకారులకు కబడ్డీ కిట్లను సర్పంచ్ జంగం భూషణం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులు ఈ కిట్లను ఉపయోగించుకొని క్రీడల్లో మరింత రాణించాలన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): సబ్దల్‌పూర్ గ్రామానికి చెందిన వ్యక్తి ఇటీవల సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నారని ఎస్సై గణేష్ తెలిపారు. బాధితుడు ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ యాప్‌లో వివరాలు నమోదు చేసి ట్రాక్ చేశామన్నారు. రికవరీ చేసిన ఫోన్‌ను సోమవారం బాధితుడికి అందించినట్లు ఎస్సై తెలిపారు.

అపరిచిత వ్యక్తులు కనిపిస్తే సమాచారమివ్వాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు సంచరించినట్లు అనిపిస్తే వెంటనే పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్సై రాజేశ్ సూచించారు. ఇటీవల ఇందల్వాయిలో చోటు చేసుకున్న ఘటనను వివరిస్తూ రైతులు తమ పొలాల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లపై దృష్టి సారించాలన్నారు. కోతలు పూర్తి కావడంతో రైతులు పంట పొలాల దిక్కు వెళ్లరని గుర్తించి ట్రాన్స్‌ఫార్మర్‌లను, కాయిల్స్‌ను అపహరించుకు పోయే ప్రమాదం ఉందన్నారు.

టీపీటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



కామారెడ్డి టౌన్: తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని కార్యాలయం వద్ద జెండాను జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ అనిల్ కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ డాక్టర్ పి.నాగభూషణం, నాయకులు శ్రీనివాస్, విజయశ్రీ, సీహెచ్ లింగం, గోపి, తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి

రాజంపేట: జూన్ 2 నుంచి 22 వరకు తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని రాజంపేట తహసీల్దార్ జానకి పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో తహసీల్దార్ జానకితో పాటు ఎస్సై రాజు, ఎంపీడీవో బాలకిషన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నట్లు ఆమె తెలిపారు.

సమాచారం..

■ అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని మైనార్టీ బాలుర జూనియర్ కళాశాలలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేసేందుకు ఆసక్తి గల అధ్యాపకులు దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ సయ్యద్ మసూద్ సోమవారం తెలిపారు. మ్యాథ్స్, ఎకనామిక్స్, తెలుగు సబ్జెక్టులకు సంబంధించి పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. మ్యాథ్స్‌లో ఎంఎస్సీ, బీఈడీ, ఎకనామిక్స్‌లో ఎంఏ(ఎకనామిక్స్), బీఈడీ, తెలుగులో ఎంఏ(తెలుగు), బీఈడీతో పాటు ఏదైనా కళాశాలలో మూడేళ్ల పని చేసిన అనుభవం ఉండాలని అన్నారు. జూన్ 5లోగా ఎల్లారెడ్డి మైనార్టీ బాలుర జూనియర్ కళాశాలలో లేదా నిజామాబాద్‌లోని నాగారం రీజినల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

■ మోడల్ కళాశాలలో ప్రవేశానికి చివరి రోజు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని మోడల్ జూనియర్ కళాశాలలో ప్రవేశానికి మంగళవారం చివరి రోజని ప్రిన్సిపాల్ భానుమతి తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ప్రతి గ్రూపులో 40 సీట్లు ఉంటాయన్నారు.

■ నేటి నుంచి పెద్దమ్మ ఉత్సవాలు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో మంగళవారం నుంచి పెద్దమ్మ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బుధ, గురువారాల్లో ప్రత్యేక పూజలు చేయనున్నట్లు తెలిపారు. ముదిరాజ్ కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

■ నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి 132 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఈనెల మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 10 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డివిజనల్ ఇంజినీర్ సాలియా నాయక్ తెలిపారు. కామారెడ్డి పట్టణం, మండలం, సదాశివనగర్, తాడ్వాయి మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

■ రేపు రెడ్డి వసతి గృహం, సంక్షేమ భవనాలకు శంకుస్థాపన

కామారెడ్డి అర్బన్: రాజ బహదూర్ వెంకటరామిరెడ్డి విద్యా పరిషత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 31న ఉదయం 11 గంటలకు కామారెడ్డి జాతీయ రహదారి ప్రక్కన క్యాసంపల్లి శివారులో రెడ్డి వసతి గృహం, విద్యాలయం సంక్షేమ భవనాల నిర్మాణానికి భూమి పూజ నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ ఎస్.చంద్రారెడ్డి తెలిపారు. కార్యక్రమానికి స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డితో పాటు మంత్రి వి.ప్రశాంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ హాజరవుతారని పేర్కొన్నారు.

ఆధ్యాత్మికం

■ ఘనంగా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం



నిజాంసాగర్(జుక్కల్): నర్వలో రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు సోమవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గౌడ సంఘం ఆధ్వర్యంలో యజ్ఞం, హోమ కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయడంతో పాటు భక్తులకు అన్నదానం చేశారు. గౌడ సంఘం పెద్దలు రాజేశ్వర్‌గౌడ్, భాస్కర్‌గౌడ్, నవీన్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

■ నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన

నిజాంసాగర్(జుక్కల్): బ్రాహ్మణపల్లిలోని అంజనాద్రి క్షేత్రంలో నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. సోమవారం నవగ్రహాల ప్రతిష్ఠాపనతో పాటు అభిషేకాలు చేశారు. మూడు రోజుల పాటు అంజనాద్రి క్షేత్రం వేదమంత్రాలతో దద్దరిల్లింది. అంజనాద్రి ఆలయ నిర్మాణకర్త పట్లోళ్ల కిశోర్ కుమార్, విగ్రహాల దాత ఉదయ్ కుమార్, బ్రహ్మణపల్లి గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.



■ తిరుపతికి బయలుదేరిన భజన మండలి సభ్యులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): కుప్రియాల్ గ్రామానికి చెందిన కాలభైరవ భజన మండలి సభ్యులు సోమవారం తిరుపతికి బయలుదేరి వెళ్లారు. ఈ నెల 31న తిరుపతిలో జరిగే అఖండ హరినామ సంకీర్తన కార్యక్రమంలో భజన కీర్తనలు ఆలపించనున్నట్లు భజన మండలి ప్రతినిధి బాలయ్య తెలిపారు.

■ వాసవీ మాతకు పూజలు



భిక్కనూరు: పెద్దమల్లారెడ్డిలో వాసవీ మాతకు ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి వచ్చిన వాసవీ పీఠానికి ఆర్యవైశ్య మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి వాసవీ మాతకు కుంకుమ పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు వాసవీ చాలీసాను పఠించారు. తదుపరి అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించి కట్నకానుకలను ముడుపులు చెల్లించుకున్నారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అల్లాడి సుదర్శన్, ప్రధాన కార్యదర్శి మాశెట్టి శ్రీనివాస్, ప్రతినిదులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

22, 555 మందికి కంటి పరీక్షలు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఆయా జీపీలలో సోమవారం వరకు 22, 555 మందికి కంటి పరీక్షలు చేసినట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు హిమబిందు తెలిపారు. 5,325 మందికి కంటి అద్దాలు అందజేసినట్లు వెల్లడించారు. ఈ నెలాఖరు వరకు మొత్తం గ్రామ పంచాయతీల్లో పరీక్షలు పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

మహాసభను విజయవంతం చేయండి

గాంధారి(ఎల్లారెడ్డి): జూన్ 5, 6 తేదీల్లో ఖమ్మంలో నిర్వహించే ప్రగతి శీల యువజన సంఘం తెలంగాణ మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ప్రేమ్‌సింగ్ కోరారు. మంగళవారం దుర్గంలో మహాసభల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీవైఎల్ నాయకులు సాంబాజీ, శ్రీకాంత్, శ్రవణ్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సతీష్, ఉపాధ్యక్షుడు మోజీరామ్ పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయానికి విరాళాలు

పిట్లం(జుక్కల్): పోతురెడ్డిపల్లి హనుమాన్ ఆలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బొమ్మందేవ్‌పల్లికి చెందిన మాజీ సర్పంచ్ రవీందర్ రెడ్డి రూ.5 వేల నగదు, 11 తులాల వెండిని ఆలయ నిర్వాహకులు తేజ స్వామికి అందజేశారు. తేజ స్వామి మాట్లాడుతూ.. దాతల సహకారంతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నామని, దాతలందరికి కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణ టీటీడీకి..

నస్రుల్లాబాద్(బీర్కూర్): బీర్కూర్ తెలంగాణ తిరుమల దేవస్థానంలో కొలువైన శ్రీవారికి సోమవారం చందూరు గ్రామస్తులు తెలగం శెట్టి అప్పన్న దొర సుశీల దంపతులు మూడున్నర గ్రాముల బంగారం, శాశ్వత అన్నదానానికి రూ.25 వేలను విరాళంగా ఇచ్చారని మేనేజర్ విఠల్ తెలిపారు. ఈ సందర్భంగా వారిని శాలువాతో సన్మానించారు.

బీర్కూర్ తండాలో కంటి వెలుగు శిబిరం

నస్రుల్లాబాద్(బీర్కూర్): బీర్కూర్ మండలంలోని బీర్కూర్ తండాలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ రఘు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా వచ్చి కంటి పరీక్షలు చేసుకోవాలన్నారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

సత్తా చాటిన శివాయిపల్లి విద్యార్థులు

రాజంపేట: సోమవారం వెలువడిన గురుకుల సెట్ ఫలితాలలో రాజంపేట మండలం శివాయిపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. మొత్తం పాఠశాలలో 21 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 14 మంది 5వ తరగతి గురుకుల సెట్‌కు ఎంపికై నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముదాం స్వామి తెలిపారు. సర్పంచ్ విఠల్‌రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ బాలరాజు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి

కామారెడ్డి టౌన్: జిల్లాలో జిల్లా పరిషత్ ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి తెలంగాణ టీచర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిజామాబాద్ జెడ్పీ సీఈవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీటీయూ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్ మాట్లాడుతూ.. జిల్లాలోని ఉపాధ్యాయుల జీపీఎఫ్ అకౌంట్స్ అప్‌డేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని, రుణాల పెండింగ్ ఫైల్స్ త్వరితగతంగా చేపట్టాలని కోరారు. నాయకులు రజాక్, శ్రీనివాస్ , తదితరులు పాల్గొన్నారు.